బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ | గురువారం జులై 02 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

## టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర

**డీఎంకేపై సంచలన ఆరోపణలు**

**రూ.35 కోట్ల లంచం ఆఫర్ చేశారన్న టీవీకే ఎమ్మెల్యే**

**ముగ్గురు అరెస్టు.. సమగ్ర దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తమిళనాడులో అధికార టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు డీఎంకే కుట్ర పన్నిందంటూ ఆ పార్టీ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేను ప్రలోభపెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయించాలని రూ.35 కోట్ల లంచం ఆఫర్ చేశారని రాష్ట్ర మంత్రి నిర్మల్ కుమార్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

మంత్రి నిర్మల్ కుమార్ మాట్లాడుతూ, అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని తమ ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చారని, అయితే ఆయన ఆ ప్రతిపాదనను తిరస్కరించారని చెప్పారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆధారాలను పోలీసులకు అందజేసినట్లు వెల్లడించారు.

మిగితా 2వ పేజీలో



వైద్య చరిత్రలో

## 'ఉస్మానియా' సరికొత్త రికార్డు..

**ఒకే రోగికి ఒకేసారి 5 అవయవాల మార్పిడి!**
**దేశంలోనే మొట్టమొదటిసారిగా అరుదైన శస్త్రచికిత్స..**
**36 గంటల పాటు ఏకధాటిగా సాగిన మహా సర్జరీ**
**వైద్య బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగ కీర్తి కిరీటంలో మరో అద్భుత మణిహారం చేరింది. హైదరాబాద్‌లోని చారిత్రాత్మక ఉస్మానియా జనరల్ ఆస్పత్రి వైద్యులు సరికొత్త మైలురాయిని అధిగమించారు. దేశ వైద్య చరిత్రలోనే ఇప్పటివరకు ఎక్కడా లేని విధంగా, అత్యంత సంక్లిష్టమైన పరిస్థితుల్లో ఒకే రోగికి ఒకేసారి 5 కీలక అవయవాలను విజయవంతంగా మార్పిడి చేసి అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. దాదాపు 36 గంటల పాటు నాన్‌స్టాప్‌గా సాగిన ఈ సుదీర్ఘ శస్త్రచికిత్స సక్సెస్ కావడంతో ఉస్మానియా సర్జన్ల ప్రతిభపై దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది.

**సిరిసిల్ల టెకీకి పునర్జన్మ..**

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఒక 30 ఏళ్ల యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అరుదైన, ప్రాణాంతకమైన ఆరోగ్య సమస్యతో బాధపడుతూ ఉస్మానియా ఆస్పత్రిలో చేరారు. ఆ యువకుడి ప్రాణాలు కాపాడటం సాధారణ శస్త్రచికిత్సలతో సాధ్యం కాదని గుర్తించిన ఉస్మానియా సర్జన్లు.. అత్యంత కఠినమైన మల్టీ-ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రంగం సిద్ధం చేశారు. ప్రభుత్వ వైద్యుల అంకితభావానికి, అత్యున్నత సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిన ఈ విప్లవాత్మక ఆపరేషన్‌లో సదరు యువకుడికి ఒకేసారి ఐదు అవయవాలను విజయవంతంగా అమర్చారు.

**వైద్య చరిత్రలో సరికొత్త అధ్యాయం..**

సాధారణంగా ఒక రోగికి ఒకేసారి ఒక అవయవాన్ని మార్పిడి చేయడమే వైద్యులకు ఎంతో పెద్ద సవాలుతో కూడుకున్న పని. అలాంటిది వైద్య చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ ఉస్మానియా డాక్టర్ల బృందం ఒకే సర్జరీలో ఈ కింది 5 అవయవాలను విజయవంతంగా మార్పిడి చేసింది:

**జీర్ణాశయం**

ద్వాదశ శుక్లం (డుయోడెనమ్)
క్లోమం (పాంక్రియాస్)
చిన్న పేగు
కుడి వైపు పెద్ద పేగు

మన దేశంలో ఈ తరహా మల్టీ-ఆర్గాన్ సర్జరీ విజయవంతం కావడం ఇదే మొట్టమొదటిసారి కావడం విశేషం.

**కార్పొరేట్ ఆస్పత్రులకు తీసిపోని విధంగా..**

అధునాతన వైద్య సేవలను పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కృషికి ఈ విజయమే ప్రత్యక్ష

మిగితా 2వ పేజీలో

# రద్దీకి తగ్గట్టుగా

# ట్రాఫిక్ సిగ్నల్స్..

- **ఏఐ సాంకేతికతతో అనుసంధానించాలి**
- **అనలాగ్, మెగా ఇంజినీరింగ్ ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి సూచన..**
- **ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో కీలక సమావేశం**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మహా నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేలా, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పనిచేసే సరికొత్త సిగ్నలింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో అనలాగ్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (మేఘా) సంస్థ ఎండీ కృష్ణారెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది. ఈ రెండు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా అమలు చేయనున్న 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' వ్యవస్థపై సీఎంకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ అన్నింటినీ ఒకే తాటిపైకి తెస్తూ ఇంటిగ్రేట్ చేయాలని స్పష్టం చేశారు. కేవలం రద్దీనే కాకుండా, నగరంలోని వాతావరణ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని ట్రాఫిక్‌ను స్వయంచాలకంగా క్రమబద్ధీకరించేలా దీనిని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో అనుసంధానం చేయాలని దిశానిర్దేశం చేశారు.

**స్వయంగా నేర్చుకునే 'ఫిజికల్ ఇంటెలిజెన్స్'..**

ఈ సమావేశంలో అనలాగ్ ప్రతినిధులు సరికొత్త 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' విధానం తీరుతెన్నులను ప్రభుత్వానికి వివరించారు. ఈ వ్యవస్థ ప్రత్యేకతలు వారి మాటల్లోనే..

స్వయం అభ్యాస వ్యవస్థ: ఈ నెక్స్ట్ జనరేషన్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ముందుగా నిర్దేశించిన ప్రోగ్రామింగ్‌పై (పాత పద్ధతి) ఆధారపడదు. రోడ్లపై ఉండే వాస్తవిక పరిస్థితులను యంత్రాల ద్వారా నిరంతరం గ్రహిస్తూ, అర్థం చేసుకుని, నిరంతర అభ్యాసం ద్వారా స్వయంగా నిర్ణయాలు తీసుకుంటుంది.

పైలట్ ప్రాజెక్టు సిద్ధం: హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యల సత్వర పరిష్కారానికి ఈ సాంకేతికత ఎంతగానో దోహదపడుతుందని పేర్కొంటూ, ఇందుకు సంబంధించిన పైలట్ ప్రాజెక్టు వివరాలను, వాటి ద్వారా చేకూరే ప్రయోజనాలను సీఎంకు వివరించారు.

స్మార్ట్ రవాణా వ్యవస్థ: సెన్సార్లు, రోబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా సురక్షితమైన, వేగంగా స్పందించే పట్టణ రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు.

**'కాగ్నిటివ్ సిటీస్'గా హైదరాబాద్..**

ఈ సాంకేతికత ద్వారా భవిష్యత్తులో హైదరాబాద్‌ను 'కాగ్నిటివ్ సిటీ'గా మార్చడానికి ఉన్న విస్తృత అవకాశాలను ప్రతినిధులు వివరించారు. ముఖ్యంగా ట్రాఫిక్ రద్దీని బట్టి సిగ్నళ్ల సమయాన్ని మార్చడం, రహదారులపై ఇతర లీకేజీలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వినియోగాన్ని క్రమబద్ధీకరించడం చేయవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి మార్గం సుగమం చేయడానికి ఈ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తుందని వెల్లడించారు.

**ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందం**

'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' వేదికగా అనలాగ్ సంస్థ తెలిపిన ప్రాథమిక అంగీకారానికి అనుగుణంగా.. ఈ ఫిజికల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థపై అనలాగ్ సంస్థకు, మెగా ఇంజినీరింగ్ (మేఘా) సంస్థకు మధ్య కుదిరిన తుది అవగాహన ఒప్పంద పత్రాలను (ఎంఓయూ) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఇరు సంస్థల ప్రతినిధులు పరస్పరం అందజేసుకున్నారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావుతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా అమల్లోకి

## 'వికసిత్ భారత్ - జీ రామ్ జీ'




వివరాలు 2వ పేజీలో

- **గ్రామీణ కూలీలకు ఇకపై 125 రోజుల ఉపాధి గ్యారంటీ..**
- **కనీస దినసరి వేతనం రూ. 300గా ఖరారు**

బెంగళూరు - హైదరాబాద్ ప్రయాణికులకు

## ఆర్టీసీ తీపి కబురు

- **బోర్డింగ్, అలైటింగ్ పాయింట్లు భారీగా పెంపు..**
- **పయాణికుల సౌకర్యార్థం రూట్ల క్రమబద్ధీకరణ**




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బెంగళూరు - హైదరాబాద్ మధ్య నిరంతరం ప్రయాణించే ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) సరికొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికుల సౌకర్యాన్ని, రవాణా అవసరాలను మరింత పెంపొందించేందుకు గాను, రెండు ఐటీ నగరాల మధ్య నడిచే అన్ని ఏసీ స్లీపర్, నాన్-ఏసీ బస్సులకు బోర్డింగ్ (బస్ ఎక్కే ప్రాంతం), అలైటింగ్ (బస్ దిగే ప్రాంతం) పాయింట్లను భారీగా పెంచినట్లు టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. ప్రయాణికులు తమ నివాసాలకు రాత్రి వేళల్లో సులభంగా, సురక్షితంగా చేరుకునేందుకు వీలుగా ఈ రూట్లను ప్రత్యేకంగా క్రమబద్ధీకరించారు.బెంగళూరులో బోర్డింగ్ అండ్ అలైటింగ్ పాయింట్ల వివరాలు:

మిగితా 4వ పేజీలో

**కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి**
**ఒకటో తేదీనే జీతాలు!**
**సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో తొలిరోజే వేతనాలు విడుదల చేసిన ఆర్థిక శాఖ**

మిగితా 2వ పేజీలో

రైతులకే కాంగ్రెస్ ప్రభుత్వం

## రూ.1,13,000 కోట్లు బాకీ



- **దమ్ముంటే ఆ నిధులు ఇచ్చాకే ఉత్సవాలు చేయండి**
- **సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర ధ్వజం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని నిండా ముంచి, ఇప్పుడు మోసపూరితంగా రైతు ఆశీర్వాద సభలు పెడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి కేవలం రైతులకే రూ. 1,13,000 కోట్లు బాకీ పడ్డారని, దమ్ముంటే ఈ బాకీ మొత్తాన్ని తీర్చిన తర్వాతే రైతు ఉత్సవాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అట్టర్ ఫ్లాప్ సినిమాకి అర్ధశత దినోత్సవం (హాఫ్ సెంచరీ) వేడుకలు జరపడం అంటే కాంగ్రెస్ చేస్తున్న ఈ ఉత్సవాలేనని ఆయన మండిపడ్డారు.

**కోటి ఎకరాల మాగాణి సాక్ష్యం 'మార్క్‌ఫెడ్' వెబ్‌సైట్..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని కేటీఆర్ గణాంకాలతో సహా వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ కొత్తలో (2014-15) కేవలం 26.13 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగు జరిగేదని, కానీ కేసీఆర్ పాలన ముగిసే నాటికి (2023-24) అది ఏకంగా 59.89 లక్షల హెక్టార్లకు పెరిగిందని స్పష్టం చేశారు. అంటే కేసీఆర్ కృషితో రాష్ట్రంలో కోటి ఎకరాల మాగాణి పెరిగిందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో రాష్ట్రంలో కేవలం 24.29 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరిగితే, ఆయన దిగిపోయే నాటికి అది రెట్టింపు (డబుల్) అయిందని తెలిపారు. ఈ వివరాలన్నీ ప్రభుత్వ అధికారిక మార్క్ ఫెడ్ వెబ్‌సైట్‌లోనే ఉన్నాయని, కావాలంటే చూసుకోవచ్చన్నారు.

మిగితా 2వ పేజీలో

## రాజస్థాన్‌లో ఘోరం...

**13 ఏళ్ల బాలికపై 30 మంది సామూహిక అత్యాచారం!**
**ఐదు రోజుల పాటు నరకయాతన..**
**బుల్డోజర్లతో నాలుగు హోటళ్లను కూల్చివేసిన అధికారులు**
**ప్రధాన నిందితులతో సహా 12 మంది అరెస్ట్.. నిరసనలతో అట్టుడుకుతున్న**

వివరాలు 2వ పేజీలో

**వాట్సాప్ 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్రం తీవ్ర ఆగ్రహం..**

- **'మెటా'కు నోటీసులు!**
- **ఫీచర్‌ను భారత్‌లో నిలిపివేయాలని ఆదేశం.. మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం గడువు**

వివరాలు 2వ పేజీలో

## నీట్ పీజీ - 2026

**దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం!**

- **ఆగస్టు 30న పరీక్ష..**
- **సెప్టెంబర్ 30న ఫలితాలు..**
- **ఎగ్జామ్ సెంటర్ల కేటాయింపు నిబంధనల్లో కీలక మార్పు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే 'నీట్ పీజీ - 2026' పరీక్షకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎమ్ఎస్) బుధవారం (జూలై 1న) ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఎన్‌బీఈఎమ్ఎస్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ముఖ్యమైన తేదీల వివరాలు (షెడ్యూల్): వివరాలుతేదీ / సమయందరఖాస్తుల

వివరాలు 2వ పేజీలో



వివరాలు 4వ పేజీలో

రైతులకు మరో విడత

## 'రైతుభరోసా' విడుదల!

**2 నుంచి 3 ఎకరాల లోపు రైతులకు పెట్టుబడి సాయం..**
**ఖాతాల్లో రూ.1,590 కోట్లు జమరెండు విడతల్లో ఇప్పటివరకు 54.96 లక్షల మంది అన్నదాతలకు లబ్ధి మంత్రి తుమ్మల**

## వాణిజ్య ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు

**19 కిలోల కమర్షియల్ సిలిండర్‌పై రూ.183.50 తగ్గింపు**
**నయారా ఎనర్జీ పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 కోత**

వివరాలు 4వ పేజీలో



## బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తివేత..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



మహారాష్ట్రలోని ఎగువ గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను బుధవారం అధికారులు అధికారికంగా ఎత్తివేశారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) ప్రతినిధులు, మహారాష్ట్ర మరియు తెలంగాణ రాష్ట్రాల ఇరిగేషన్ ఉన్నతాధికారుల సంయుక్త సమక్షంలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. అయితే, ప్రస్తుతం బాబ్లీ ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో నీటి నిల్వలు చాలా స్వల్పంగా ఉండడం వల్ల దిగువన ఉన్న తెలంగాణ ప్రాంతానికి కేవలం 0.20 టిఎంసిల వరద నీరు మాత్రమే వచ్చి చేరింది. గత దశాబ్ద కాలంలో ఎగువ గోదావరి ప్రాంతం నుండి ఈ స్థాయిలోనే అత్యంత తక్కువ మొత్తంలో వరద రావడం ఇదే తొలిసారి అని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. అక్టోబర్ 28 వరకు దిగువకు గోదావరి జలాలు..అంతర్ రాష్ట్ర జలవివాదాల నేపథ్యంలో గతంలో సుప్రీంకోర్టు జారీ చేసిన చారిత్రాత్మక మార్గదర్శకాలు, తీర్పునకు లోబడి ఇరు రాష్ట్రాల అధికారులు ప్రతి ఏటా వర్షాకాలంలోనూ, ఎండాకాలంలోనూ నిర్ణీత గడువుల ప్రకారం బాబ్లీ గేట్లను ఎత్తి దిగువన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) వైపునకు గోదావరి వరద నీటిని వదిలిపెడుతున్నారు. ఈ నిబంధనల ప్రకారమే ఇప్పుడు ఎత్తిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు అక్టోబర్ 28వ తారీఖు వరకు నిరంతరాయంగా తెరిచే ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. ఎగువన వర్షాలు పడి వరద పెరిగితే దిగువన ఉన్న తెలంగాణ పరివాహక ప్రాంతాలకు మరిన్ని నీరు వచ్చే అవకాశం ఉందని రైతాంగం ఆశాభావం వ్యక్తం చేస్తోంది

# కేసీఆర్ 'పశుపతి' అయితే.. నువ్వు 'బూతుపతి'వా..?

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సినిమా డైలాగులపై**
**హరీశ్ రావు ఘాటు కౌంటర్ సి**
**డైలాగులు కొడితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు**
**మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు హెచ్చరిక**



**బలగం టీవీ, హైదరాబాద్**

'అరుంధతి' సినిమా డైలాగులను ఉటంకిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన తీవ్ర వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్ రావు తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. కరీంనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. "రేవంత్ రెడ్డి ఎప్పుడూ పిచ్చి పిచ్చి డైలాగులు కొడుతుంటాడు. నిన్న కేసీఆర్‌ను పట్టుకొని పశుపతి అన్నావు.. మరి నువ్వేంటి రేవంత్ రెడ్డి.. 'బూతుపతి'వా..?" అంటూ హరీశ్ రావు అత్యంత ఘాటుగా ప్రశ్నించారు. పశుపతినాథ్ అంటే శివుడి ప్రతిరూపం..పశుపతి అనే పదానికి ఉన్న ఆధ్యాత్మిక, వాస్తవ అర్థాన్ని హరీశ్ రావు ఈ సందర్భంగా వివరించారు. "నేపాల్ దేశంలో హిందువులంతా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించే పశు పతినాథ్ దేవాలయం ఉంది. పశుపతినాథ్ అంటే పశువులను, సమస్త జీవకోటి రాశులను కాపాడేటువంటి సాక్షాత్తూ ఆ పరమశివుడికి ప్రతిరూపం. మన కేసీఆర్ కూడా రాష్ట్రంలో అంత అద్భుతంగా రైతులను, రైతుల చేతుల్లో ఉండే పాడి పశువులను, ప్రజలందరినీ కాపాడి తెలంగాణను అద్భుతంగా అభివృద్ధి చేశారు" అని కొనియాడారు. కేవలం రాజకీయ కక్షతో కేసీఆర్‌ను పట్టుకొని రేవంత్ రెడ్డి సినిమా డైలాగులు కొట్టినంత మాత్రాన ఇక్కడి ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన హెచ్చరించారు.

వివాదానికి కారణమైన సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు:మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రైతు సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌ను ఉద్దేశించి 'అరుంధతి' సినిమా ఉదాహరణతో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫాంహౌస్‌లో గొలుసులు వేసి బంధించాం: సీఎం

"అరుంధతి సినిమాలో రాక్షసుడైన పశుపతిని ఎట్లయితే బూతుబంగ్లాలో వేసి బంధించామో.. ఈ రాక్షసుడిని (కేసీఆర్‌ను) కూడా ఫాంహౌస్‌లో గొలుసులు వేసి మా రైతులు బంధించారు. ఆ గొలుసులు తెంచేది లేదు.. ఆయనను ఫాంహౌస్ దాటించి బయటకు రానిచ్చేదే లేదు" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చేసిన ఈ 'రాక్షసుడు', 'పశుపతి' వ్యాఖ్యలపైనే గులాబీ శ్రేణులు ఇప్పుడు భగ్గుమంటున్నాయి. సీఎం స్థాయి వ్యక్తి ఇలాంటి సినిమా డైలాగులతో ప్రతిపక్ష నాయకుడిని విమర్శించడం సరికాదని, పరిపాలన చేతకాకే ఇలాంటి డైలాగులతో కాలయాపన చేస్తున్నారని హరీశ్ రావు కరీంనగర్ వేదికగా దుయ్యబట్టారు.

# దేశవ్యాప్తంగా అమల్లోకి 'వికసిత్ భారత్ - జీ రామ్ జీ

- **గ్రామీణ కూలీలకు ఇకపై 125 రోజుల ఉపాధి గ్యారంటీ..**
- **కనీస దినసరి వేతనం రూ. 300గా ఖరారు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉపాధి, జీవనోపాధి భద్రత కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ -- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్)' చట్టం, 2025 బుధవారం నుండి దేశవ్యాప్తంగా అధికారికంగా అమలులోకి వచ్చింది. ఈ నూతన చట్టం ప్రకారం.. అర్హులైన ప్రతి గ్రామీణ కుటుంబానికి ఇకపై ఏడాదికి 125 రోజుల పాటు చట్టబద్ధమైన ఉపాధి కూలి పొందే హక్కు లభిస్తుంది. ఈ చట్టం అమలుతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన సవరించిన నూతన వేతన ధరలను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది.

**10 శాతానికి పైగా పెరిగిన ఉపాధి వేతనాలు..**

నూతన చట్టం ప్రకారం దేశంలో ఎక్కడా కూడా నోటిఫైడ్ దినసరి వేతనం రూ. 300 కంటే తక్కువ ఉండకూడదని కేంద్రం స్పష్టం చేసింది.

జాతీయ సగటు పెంపు: తాజా నిర్ణయంతో జాతీయ సగటు దినసరి వేతనం రూ. 298.8 నుండి రూ. 327.4 కు పెరిగింది.

ఆర్థిక ఊతం: ఇది మునుపటి వేతనాల కంటే 10 శాతానికి పైగా అదనపు పెంపును సూచిస్తోంది, దీనివల్ల దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది గ్రామీణ కార్మిక కుటుంబాలకు ఆర్థికంగా భారీ లబ్ధి చేకూరనుంది.

**నేడు తిరుపతి వేదికగా జాతీయ స్థాయి ప్రారంభోత్సవం..**

ఈ చారిత్రాత్మక చట్టం యొక్క జాతీయ స్థాయి అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

**గ్రామీణ భారతానికి ఇదొక అపూర్వమైన రోజు: శివరాజ్ సింగ్ చౌహాన్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చట్టం గ్రామీణ కార్మికుల జీవితాల్లో సరికొత్త విప్లవాన్ని తీసుకువస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కొనియాడారు. కోట్లాది మంది గ్రామీణ కూలీల ఆత్మగౌరవానికి, జీవనోపాధి భద్రతకు ఈ చట్టం ఒక కొత్త శకానికి నాంది పలుకుతుందన్నారు. ఇప్పటివరకు ఉన్న 100 రోజుల పరిమితిని 125 రోజులకు పెంచామని, దేశంలో ఒక్క అర్హత గల కార్మికుడు కూడా ఒక్క రోజు కూడా ఉపాధికి దూరం కాకూడదన్నదే కేంద్ర ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.

ఈ చట్టం సజావుగా సాగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాల పరిపాలనా, ఆర్థిక, సాంకేతిక ఏర్పాట్లను పూర్తి చేశాయని మంత్రి తెలిపారు. ఈ విప్లవాత్మక నిర్ణయం వల్ల గ్రామాల్లో శాశ్వత ఆస్తుల కల్పన జరగడమే కాకుండా, మహిళా సాధికారత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఆత్మనిర్భర్, వికసిత్ గ్రామీణ భారతం' స్వప్నాన్ని సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

### రైతులకే కాంగ్రెస్ ప్రభుత్వం

# రూ.1,13,000 కోట్లు బాకీ

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఒక ఎకరానికి రైతుబంధు వేయడానికి కూడా పెద్ద పెద్ద సభలు పెడుతూ ప్రచారం గిమ్మిక్కులు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. "మొన్నటిదాకా కేంద్రం మీద యుద్ధం చేస్తా, పంట మొత్తం నేనే కొనిపిస్తా అని రేవంత్ రెడ్డి 'తీస్మార్ ఖాన్' లాగా భారీ డైలాగులు కొట్టారు. కానీ తీరా అధికారంలోకి వచ్చాక.. ప్రధాని మోదీ ఎంత పంట కొనమని చెప్తే అంతే కొంటా అంటూ 'బుడ్డర్ ఖాన్' మాటలు మాట్లాడుతున్నారు" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి చేసిన దివాళాకోరు రాజకీయం, ఓటుకు నోటు దొంగ అయిన చరిత్ర వల్ల ఢిల్లీలో ఆయనను అందరూ అసహ్యంగానే చూస్తారని విమర్శించారు.

"మేము చేసిన అప్పు రూ. 2.78 లక్షల కోట్లు అని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా పార్లమెంట్‌లో చెప్పింది. కానీ నువ్వేమో రూ. 7 లక్షల కోట్లు అంటావు, నీ పక్కనోడు రూ. 8 లక్షల కోట్లు అంటాడు. మొహం బాగాలేకపోతే అద్దం పగలకొట్టుకున్నట్లు.. నీకు నగరపాలన, రాష్ట్ర పరిపాలన చేతగాక ఇంకా ఎన్ని రోజులు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద ఏడుస్తూ కాలం గడుపుతావు?" అని కేటీఆర్ ముఖ్యమంత్రిని ఘాటుగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి లూటీలు, లుచ్చా మాటలు కట్టిపెట్టి తెలంగాణలోనే ఉండి పరిపాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ ప్రెస్ మీట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు మరియు కేటీఆర్ చేసిన విమర్శలను ప్రత్యక్షంగా [KTR FULL Press Meet Video] (https://www.youtube.com/watch?vR9GooAoX3ukU) లింక్ ద్వారా వీక్షించవచ్చు.

# టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడులో అధికార టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు డీఎంకే కుట్ర పన్నిందంటూ ఆ పార్టీ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేను ప్రలోభపెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయించాలని రూ.35 కోట్ల లంచం ఆఫర్ చేశారని రాష్ట్ర మంత్రి నిర్మల్ కుమార్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. మంత్రి నిర్మల్ కుమార్ మాట్లాడుతూ, అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని తమ ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చారని, అయితే ఆయన ఆ ప్రతిపాదనను తిరస్కరించారని చెప్పారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆధారాలను పోలీసులకు అందజేసినట్లు వెల్లడించారు.

టీవీకే ఎమ్మెల్యే ఎన్. ఇళయరాజా కూడా తనను బెదిరించారని ఆరోపించారు. తమిళనాడు శాసనసభలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరుతూ రూ.35 కోట్ల లంచం ఇవ్వజూపారని, నిరాకరించడంతో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారని తెలిపారు.

జూన్ 29న చెన్నై పోలీసు కమిషనర్‌కు ఎమ్మెల్యే ఇళయరాజా ఫిర్యాదు చేశారు. తిరునావుక్కరసు అనే వ్యక్తి తనను కలిసి ఒక రాజకీయ పార్టీ తరఫున వచ్చినట్లు చెప్పి, అసెంబ్లీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తే రూ.35 కోట్లు ఇస్తామని ప్రతిపాదించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను నిరాకరించడంతో బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు.

ఈ ఫిర్యాదు ఆధారంగా డి-1 ట్రిప్లికేన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు తిరునావుక్కరసు, నరేశ్, త్యాగరాజన్‌లను అరెస్టు చేశారు.

పోలీసుల విచారణలో మాజీ మంత్రి, ప్రస్తుత కోయంబత్తూరు సౌత్ ఎమ్మెల్యే వి. సెంథిల్ బాలాజీ సోదరుడు వి. అశోక్ కుమార్‌తో నిందితులకు సంబంధాలు ఉన్నట్లు సమాచారం లభించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# రాజస్థాన్‌లో ఘోరం..

**13 ఏళ్ల బాలికపై 30 మంది సామూహిక అత్యాచారం!**
**ఐదు రోజుల పాటు నరకయాతన..**
**బుల్డోజర్లతో నాలుగు హోటళ్లను కూల్చివేసిన అధికారులు**
**ప్రధాన నిందితులతో సహా 12 మంది అరెస్ట్.. నిరసనలతో అట్టుడుకుతున్న శ్రీగంగానగర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాజస్థాన్‌లో మానవత్వాన్ని మంటగలిపే అత్యంత దారుణమైన సంఘటన వెలుగుచూసింది. శ్రీగంగానగర్ జిల్లాకు చెందిన 13 ఏళ్ల మైనర్ బాలికపై దాదాపు 30 మంది మృగాళ్లు ఐదు రోజుల పాటు సామూహిక అత్యాచారానికి, లైంగికదాడికి ఒడిగట్టారు. ఈ అమానుష ఘటనపై రాజస్థాన్ ప్రభుత్వం మరియు యంత్రాంగం అత్యంత కఠినంగా స్పందించింది. అఘాయిత్యానికి వేదికైన, నలుగురు ప్రధాన నిందితులకు (హోటల్ యజమానులకు) చెందిన నాలుగు హోటళ్లను బుధవారం అధికారులు బుల్డోజర్లతో పూర్తిగా కూల్చివేశారు.

పోలీసులు మరియు స్థానిక వర్గాల సమాచారం ప్రకారం.. శ్రీగంగానగర్‌కు చెందిన 13 ఏళ్ల చిన్నారి జూన్ 18న స్థానిక రిక్షా కార్మికుడి చేతిలో కిడ్నాప్‌నకు గురైంది. ఆ రిక్షా కార్మికుడు బాలికను బలవంతంగా ఎత్తుకెళ్లి ఒక హోటల్ నిర్వాహకుడికి అప్పగించాడు. ఆ హోటల్ ఓనర్ చిన్నారిని బంధించి తొలిసారి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత అంతటితో ఆగకుండా బాలికను నగరంలోని మరికొన్ని హోటళ్లకు రవాణా చేశాడు. అలా మొత్తం నాలుగు హోటళ్లలో ఆ చిన్నారిని బంధించి, దాదాపు ఐదు రోజుల పాటు నరకయాతన చూపించారు.

**మద్యం తాగించి మరీ ఘోరం..**

వివిధ హోటళ్ల యాజమాన్యాలు, వారి అనుచరులతో కలిపి మొత్తం 30 మంది వరకు ఈ దారుణానికి ఒడిగట్టారు. తీవ్రమైన నొప్పితో ఇబ్బంది పడుతూ ఏడుస్తున్న ఆ చిన్నారిపై కనీసం జాలి చూపకుండా, బలవంతంగా ఆల్కహాల్ (మద్యం) తాగించి మరీ లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ అఘాయిత్యంలో నాలుగు హోటళ్ల ఓనర్లు ప్రధాన పాత్ర పోషించడమే కాకుండా, ఈ ఘోరాన్ని బయటి ప్రపంచానికి తెలియకుండా దాచిపెట్టే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు ఈ నరకం నుండి బయటపడిన బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.



**12 మంది అరెస్ట్.. బుల్డోజర్ యాక్షన్..**

ఈ ఘాతుకంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఘటనలో ఇప్పటివరకు నలుగురు ప్రధాన నిందితులతో సహా మొత్తం 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. నలుగురు ప్రధాన నిందితులపై ఉన్న నేర నిరూపణ ఆధారంగా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వేదికైన వారి నాలుగు హోటళ్లను జిల్లా యంత్రాంగం బుధవారం బుల్డోజర్లతో నేలమట్టం చేసింది.

ఈ అమానుష ఘటనపై స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులను బహిరంగంగా ఉరితీయాలంటూ శ్రీగంగానగర్‌లో భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు, ధర్నాలు జరుగుతున్నాయి. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ హరిశంకర్ స్పందిస్తూ.. నిందితులపై పోక్సో (ౡఉజూఉ) చట్టంతో పాటు కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వీలైనంత త్వరగా నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# నీట్ పీజీ - 2026 దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభంజూలై 1, 2026 దరఖాస్తుకు ఆఖరి తేదీజూలై 21 (ఉదయం 11:55 గంటల వరకు) ఎగ్జామ్ సెంటర్ ముందస్తు సమాచారంఆగస్టు 11, 2026 పరీక్ష నిర్వహణ తేదీఆగస్టు 30, 2026 ఫలితాల విడుదలసెప్టెంబర్ 30, 2026 పరీక్ష కేంద్రాల కేటాయింపులో కొత్త రూల్..ఈసారి నీట్-పీజీ పరీక్ష కేంద్రాల (ఎగ్జామ్ సెంటర్స్) కేటాయింపు విధానంలో ఎన్‌బీఈఎమ్ఎస్ ఒక కీలక మార్పును తీసుకువచ్చింది. గతంలో అమలులో ఉన్న 'మొదట దరఖాస్తు చేసుకున్న వారికి మొదటి ప్రాధాన్యత' (ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్) పద్ధతిని ఈ విద్యా సంవత్సరం నుండి పూర్తిగా రద్దు చేసింది. నూతన నిబంధనల ప్రకారం..మూడు రాష్ట్రాల ఎంపిక తప్పనిసరి: అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే సమయంలోనే పరీక్ష రాయాలనుకుంటున్న మూడు రాష్ట్రాలను ప్రాధాన్యత క్రమంలో ఎంచుకోవాల్సి ఉంటుంది. సొంత రాష్ట్రానికే తొలి ప్రాధాన్యత: అభ్యర్థి ఎంచుకునే మూడు రాష్ట్రాలలో మొదటిది సదరు అభ్యర్థి ప్రస్తుతం నివసిస్తున్న (సొంత) రాష్ట్రం అయి ఉండాలి. పొరుగు రాష్ట్రాల ఎంపిక: మిగిలిన రెండు ఆప్షన్లుగా తమకు దగ్గరగా ఉండే పొరుగు రాష్ట్రాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు సమర్పించిన వివరాల ఆధారంగా వారికి ప్రస్తుతం నివసిస్తున్న రాష్ట్రంలోనే సెంటర్ కేటాయించాలా? లేదా మిగిలిన రెండు పొరుగు రాష్ట్రాలలో ఏది కేటాయించాలనే తుది నిర్ణయాన్ని పూర్తిగా 'ఎన్‌బీఈఎమ్ఎస్' బోర్డే నిర్ణయిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

### వైద్య చరిత్రలో

# 'ఉస్మానియా' సరికొత్త రికార్డు..

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శనమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ రంగంలో

ఉస్మానియా ఆస్పత్రి సాధించిన ఈ అసాధారణ విజయంతో తెలంగాణ ప్రభుత్వ వైద్య కీర్తి ప్రపంచ స్థాయికి చేరింది. భగీరథ ప్రయత్నంలా సాగిన ఈ సర్జరీని విజయవంతం చేసిన ఉస్మానియా ట్రాన్స్‌ప్లాంట్ టీమ్‌కు, ఇందుకు సహకరించిన పారామెడికల్ సిబ్బందికి సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఉస్మానియా వైద్య బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

వైద్యుల దినోత్సవం వేళ సాధించిన రికార్డు ఆదర్శనీయం: ముఖ్యమంత్రి ప్రశంసలు

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రపత్రిక):

ఏకబిగిన 36 గంటలపాటు శ్రమించి, ఒకే రోగికి ఒకేసారి ఐదు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిన ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్యులు, పారామెడికల్ మరియు ఇతర సిబ్బందిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా అభినందించారు. దేశ వైద్య రంగంలోనే అత్యంత అరుదైన ఈ రికార్డును ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఈ మేరకు ముఖ్యమంత్రి ఒక ప్రకటన విడుదల చేస్తూ.. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 30 ఏళ్ల యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు జీర్ణాశయం, డ్యూడెనమ్ (ద్వాదశ శుక్లం), ప్యాంక్రియాస్ (క్లోమం), చిన్నపేగు, పెద్దపేగు వంటి ఐదు కీలక అవయవాలను ఒకేసారి విజయవంతంగా మార్పిడి చేసి దేశంలోనే సరికొత్త రికార్డును లిఖించారని కొనియాడారు.

**వైద్య వృత్తికే ఆదర్శం..**

సరిగ్గా 'జాతీయ వైద్యుల దినోత్సవం' (నేషనల్ డాక్టర్స్ డే) రోజే ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్య బృందం ఈ అసాధారణ విజయాన్ని సాధించడం విశేషమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక యువకుడికి పునర్జన్మ ప్రసాదించి, వైద్యుల దినోత్సవం నాడు తమ వృత్తికి మరింత ఆదర్శంగా నిలిచారని సీఎం కొనియాడారు. ఇంతటి భారీ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన ట్రాన్స్‌ప్లాంట్ బృందంలోని ప్రతి ఒక్కరినీ ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఒకటో తేదీనే జీతాలు!

**సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో తొలిరోజే వేతనాలు విడుదల చేసిన ఆర్థిక శాఖ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా ఒకటో తేదీనే వేతనాలు అందాలన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమల్లోకి వచ్చాయి. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి ఆర్థిక శాఖ బుధవారం (ఈ నెల మొదటి తేదీనే) జీతాలను విజయవంతంగా విడుదల చేసింది.

గతంలో జీతాల చెల్లింపుల్లో జరుగుతున్న ఆలస్యం వల్ల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన ముఖ్యమంత్రి.. దీనిపై ఇటీవల ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతనం (ఆనరరియం) ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బందికి కూడా ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు అందాలని అధికారులను కఠినంగా ఆదేశించారు.

ముఖ్యమంత్రి ఆదేశాల అమలు కోసం ఆర్థిక శాఖ ఇటీవల అన్ని ప్రభుత్వ శాఖలు, విభాగాలకు ప్రత్యేక సర్క్యులర్ జారీ చేసింది. జీతాల బిల్లుల సమర్పణ, పరిశీలన, ఆడిట్, ఆథరైజేషన్ వంటి ప్రక్రియల్లో ఎక్కడా జాప్యం జరక్కుండా కింది విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది: 25వ తేదీలోగా బిల్లుల సమర్పణ: ప్రతి నెల 25వ తేదీలోగా జీతాలు, రెమ్యునరేషన్ బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్, అకౌంట్స్ విభాగాలకు తప్పనిసరిగా సమర్పించాలి. నెల ఆఖరి నాటికి పరిశీలన పూర్తి: నెల చివరి పని దినానికల్లా బిల్లుల పరిశీలన, ఆడిట్, ఆథరైజేషన్ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని ట్రెజరీ అధికారులను ఆదేశించింది.

**అధికారులను ఆరా తీసిన ముఖ్యమంత్రి..**

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాల చెల్లింపుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆర్థిక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో బిల్లులు అందిన అన్ని విభాగాల ఉద్యోగుల ఖాతాల్లో మొదటి రోజే విజయవంతంగా జీతాలు జమ చేసినట్లు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా ఒకటో తేదీనే వేతనాలు అందాలన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమల్లోకి వచ్చాయి. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి ఆర్థిక శాఖ బుధవారం (ఈ నెల మొదటి తేదీనే) జీతాలను విజయవంతంగా విడుదల చేసింది. గతంలో జీతాల చెల్లింపుల్లో జరుగుతున్న ఆలస్యం వల్ల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన ముఖ్యమంత్రి.. దీనిపై ఇటీవల ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతనం (ఆనరరియం) ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బందికి కూడా ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు అందాలని అధికారులను కఠినంగా ఆదేశించారు.

**ఆర్థిక శాఖ ముందస్తు చర్యలు..**

ముఖ్యమంత్రి ఆదేశాల అమలు కోసం ఆర్థిక శాఖ ఇటీవల అన్ని ప్రభుత్వ శాఖలు, విభాగాలకు ప్రత్యేక సర్క్యులర్ జారీ చేసింది. జీతాల బిల్లుల సమర్పణ, పరిశీలన, ఆడిట్, ఆథరైజేషన్ వంటి ప్రక్రియల్లో ఎక్కడా జాప్యం జరక్కుండా కింది విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది: 25వ తేదీలోగా బిల్లుల సమర్పణ: ప్రతి నెల 25వ తేదీలోగా జీతాలు, రెమ్యునరేషన్ బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్, అకౌంట్స్ విభాగాలకు తప్పనిసరిగా సమర్పించాలి. నెల ఆఖరి నాటికి పరిశీలన పూర్తి: నెల చివరి పని దినానికల్లా బిల్లుల పరిశీలన, ఆడిట్, ఆథరైజేషన్ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని ట్రెజరీ అధికారులను ఆదేశించింది.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాల చెల్లింపుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆర్థిక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో బిల్లులు అందిన అన్ని విభాగాల ఉద్యోగుల ఖాతాల్లో మొదటి రోజే విజయవంతంగా జీతాలు జమ చేసినట్లు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### బెంగళూరు - హైదరాబాద్ ప్రయాణికులకు

# ఆర్టీసీ తీపి కబురు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వివిధ మార్గాల్లో నడిచే బస్సులను బట్టి బెంగళూరు నగరంలో స్టాప్‌ల వివరాలను సంస్థ కింది విధంగా వర్గీకరించింది:మార్గం (రూట్)అందుబాటులో ఉండే ప్రధాన స్టాప్‌లు (స్టేజీలు)1. పీనియా రూట్ పీనియా, యశ్వంతపూర్ మెట్రో స్టేషన్, కెంపెగౌడ బస్ స్టేషన్ (మెజెస్టిక్), హెబ్బల్, ఎస్టీమ్ మాల్, ఎలాహంక, బెంగళూరు ఎయిర్ పోర్ట్ టోల్ ప్లాజా, దేవనహళ్లి బైపాస్.2. చందాపూర్ రూట్ చందాపూర్, బొమ్మసంద్ర, ఎలక్ట్రానిక్ సిటీ, బొమ్మనహళ్లి మెట్రో స్టేషన్, మడివాళ, కెంపెగౌడ బస్ స్టేషన్, హెబ్బల్ ఉ ఎస్టీమ్ మాల్, ఎలాహంక, బెంగళూరు ఎయిర్ పోర్ట్ టోల్ ప్లాజా, దేవనహళ్లి బైపాస్.3. మార్తహళ్లి రూట్ వర్తూర్ జంక్షన్, మార్తహళ్లి, దొమ్మలూరు బ్రిడ్జి, కెంపెగౌడ బస్ స్టేషన్, హెబ్బల్ ఉ ఎస్టీమ్ మాల్, ఎలాహంక, బెంగళూరు ఎయిర్ పోర్ట్ టోల్ ప్లాజా, దేవనహళ్లి బైపాస్.హైదరాబాద్‌లో బోర్డింగ్ ఉ అలైటింగ్ పాయింట్ల వివరాలు:బెంగళూరు నుండి హైదరాబాద్ వచ్చే అన్ని రకాల సర్వీసుల ప్రయాణికుల కోసం నగరంలోని మూడు ప్రధాన మార్గాల్లో కింది విధంగా స్టాప్‌లు అందుబాటులో ఉంటాయి:పటాన్‌చెరు రూట్: పటాన్‌చెరు నుండి ఎంజీబీఎస్ ( , ఆరాంఘర్, శంషాబాద్ వరకు ఉన్న అన్ని ప్రధాన స్టేజీలలో బస్సులు ఎక్కే, దిగే సదుపాయం కలదు.జేబీఎస్ రూట్: సికింద్రాబాద్ జేబీఎస నుండి ఎంజీబీఎస్, ఆరాంఘర్, శంషాబాద్ వరకు ఉన్న అన్ని ప్రధాన కూడళ్లలో స్టాప్‌లు ఉంటాయి.హయత్ నగర్ రూట్: హయత్ నగర్ నుండి ఎల్బీనగర్ మీదుగా ఎంజీబీఎస్, ఆరాంఘర్, శంషాబాద్ వరకు ఉన్న అన్ని ప్రధాన స్టేజీలలో ప్రయాణికులు బోర్డింగ్/అలైటింగ్ కావచ్చు.ఆర్టీసీ యాజమాన్యం పిలుపు..టీజీఎస్ ఆర్టీసీ కల్పించిన ఈ అద్భుతమైన సదవకాశాన్ని బెంగళూరు - హైదరాబాద్ మధ్య ప్రయాణించే ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులందరూ వినియోగించుకోవాలని సంస్థ కోరింది. ప్రయాణికులు తమ ఇళ్లకు దగ్గరలోనే ఉన్న బోర్డింగ్ పాయింట్లను ఎంచుకుని, ప్రభుత్వ రవాణా సంస్థలో సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణాన్ని ఆస్వాదించాలని యాజమాన్యం సూచించింది.ముందస్తు బుకింగ్స్ కోసం:ప్రయాణికులు సులభంగా తమ టికెట్లను ముందస్తుగా బుక్ చేసుకోవడానికి టీజీఎస్ ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ www.tgsrtcbus.in ను సందర్శించాల్సిందిగా కోరారు.

## వాట్సాప్ 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్రం తీవ్ర ఆగ్రహం..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రముఖ సామాజిక విప్లవాత్మక యాప్ వాట్సాప్ త్వరలో ప్రవేశపెట్టబోతున్న సరికొత్త 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ ఫీచర్‌కు సంబంధించిన పూర్తి సాంకేతిక అంశాలు, వినియోగదారుల వ్యక్తిగత భద్రతా ప్రమాణాలతో కూడిన సమగ్ర వివరణ ఇవ్వాలని కోరుతూ వాట్సాప్ మాతృసంస్థ 'మెటా'కు కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ మంగళవారం అత్యవసర నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై మూడు రోజుల్లోగా స్పందించి, తగిన సమాధానం చెప్పాలని ఆదేశించింది.ఈ ఏడాది చివరికల్లా ప్రపంచవ్యాప్తంగా ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని మెటా సంస్థ నిర్ణయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి అనుమతులు లభించి, నివేదిక సమర్పించేంత వరకు భారతదేశంలోని వినియోగదారులకు (ఇండియన్స్‌కు) ఈ ఫీచర్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ అందుబాటులోకి తీసుకురాకూడదని కేంద్రం తన నోటీసుల్లో ఖరాఖండిగా ఆదేశించింది. ఈ ఫీచర్ ఎలా పనిచేస్తుంది? దీని వెనుక ఉన్న సైబర్ భద్రతా ప్రమాణాలు ఏమిటి? అనే విషయాలను ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేసింది.



## ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 33 వార్డులో నాగుల లక్ష్మీ, నాగుల మనోహర్ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి.. హౌసింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులు ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కూలీలను, ఇంటి నిర్మాణానికి కావలసిన మెటీరియల్ ను అందుబాటులో పెట్టుకొని పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. హౌసింగ్ అధికారులు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఈ సాజిద్, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి

**-వెయ్యికి పైగా ఎకరాల్లో నాటేందుకు ప్రణాళికలు**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

దీర్ఘకాలిక ఆదాయం సమకూరే ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో 18 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పంటల వైవిధ్యం, ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు. అలాగే రైతు వేదికలు, పీఏసీ ఎస్ లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘ కాలం పాటు ఆదాయం సమకూరుతుందని వివరించారు. జిల్లాకు సరిహద్దులోని సిద్దిపేట జిల్లాలో నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు.జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు.వెయ్యిపైగా ఎకరాల్లో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కు వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సహకార శాఖ, డ్రిప్, మొక్కలు పంపిణీ చేసే కంపెనీలు సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నాయని తెలిపారు.బుధవారం జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, బోయినపల్లి, తంగళ్ళపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో కలిపి 34 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటామని వెల్లడించారు. గొల్లపల్లిలో రైతు రాజేందర్ రెడ్డి 18 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటారాని తెలిపారుప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో దృష్ట్యా రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని సూచించారు. జిల్లాలో ఎరువులకు కొరత లేదని స్పష్టం చేశారు. యూరియా కావలసిన రైతులు ఫెర్టిలైజర్ యాప్ లో తమ వివరాలు నమోదు చేసుకుని కొనుగోలు చేయాలని పిలుపు నిచ్చారు. రైతు వేదికలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద సహాయకులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోంది

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సువీన్ యాదవ్**

**- ఘనంగా ముఖ్యమంత్రి మరియు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల క్షీరాభిషేకం**

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాష్ట్రంలోని అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతు భరోసా' పథకం కింద ఏకంగా రూ. 9,000 కోట్ల (తొమ్మిది వేల కోట్ల రూపాయల) భారీ నిధులను విడుదల చేయడంపై రైతాంగంతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయానికి కృతజ్ఞతగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి మరి యు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మరియు చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అంతా కలిసికట్టుగా క్షీరాభిషేకం (పాలాభిషేకం) చేశారు.

**వ్యవసాయాన్ని పండుగ చేస్తున్న ప్రభుత్వం:**

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సువీన్ యాదవ్ మాట్లాడుతూ: గత ప్రభుత్వం రైతులను అప్పులపాలు చేస్తే, అధికారంలోకి వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోందని కొనియాడారు. కేవలం ఒకే విడతలో రైతు భరోసా నిమిత్తం రూ. 9,000 కోట్లు విడుదల చేయడం ముఖ్యమంత్రి రైతు పక్షపాత పాలనకు నిదర్శనమన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి రైతుకూ సకాలంలో పెట్టుబడి సాయం అందేలా నిరంతరం శ్రమిస్తున్న తమ ప్రియతమ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో మండలం వ్యవసాయ రంగంలో ముందంజలో ఉందన్నారు. చిత్రపటాల పాలాభిషేక కార్యక్రమం సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి, సర్పంచులు నల్ల మోహన్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ బాలగోని వెంకటేష్, నాయకులు సంబ లక్ష్మీరాజం, ఉప సర్పంచ్ కళ్లేపల్లి చంద్రయ్య, బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, రాజ్యలక్ష్మి, రజనీకాంత్, నక్క శ్రీకాంత్, పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి, మైలారం శ్రీనివాసు, గుంటి తిరుపతి, బోయిని మల్లేశం, దూస జనార్దన్, ఒంటెల లక్ష్మారెడ్డి రైతు సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడ గ్రామంలోని సీసీ రోడ్ల నిర్మాణం మరియు అభివృద్ధి గురించి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో గ్రామస్తులు చర్చించారు.ఈ అంశంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే సీసీ రోడ్ల పనులకు మంజూరుతో పాటు గ్రామ అభివృద్ధి ని కల్పిస్తానని హామీ ఇచ్చారని గ్రామస్తులు పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు మానువాడ గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానువాడ గ్రామ సర్పంచ్ కట్ట గోవర్ధన్ గౌడ్, ఉప సర్పంచ్ జనగాం జితేందర్, వార్డు సభ్యులు ఇరవేని రమేష్, మద్దూరి విష్ణు, గంగాధర గణేష్, జనగాం లక్ష్మణ్, కర్నె పవన్ కుమార్ పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుటే మహిళల కొట్లాట

**మహిళపై చెప్పు తో దాడి చేసిన మరో మహిళ**

**మహిళ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై అశోక్**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

గ్రామాల్లో నిర్వహించే చిట్టి ల వ్యవహారంలో మహిళలు పోలీస్ స్టేషన్ వచ్చి చివరకు స్టేషన్ ముందే కొట్టకునే పరిస్థితి నెలకొంది. ఇల్లంతకుంట ఎస్ ఐ సిరిసిల్ల అశోక్ తెలిపిన వివరాల ప్రకారం మహిళలు కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిట్టి లో ఏర్పడ్డ ఘర్షణ వల్ల సమస్య పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్ చేరుకోగా పోలీసులు సద్దుమానిగే ప్రయత్నం చేయగా మహిళలు వినకపోగా ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామానికి చెందిన కోనేటి లక్ష్మి పైన బెజ్జంకి గ్రామానికి చెందిన బండి సారవ్వ చెప్పుతో కొట్టి జాకెట్ చింపివేసిందని లక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఇల్లంతకుంట ఎస్ ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు

## మున్నూరు కాపు మండలాధ్యక్షుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు అవారు బాలయ్య సతీమణి ఇటీవల అనారోగ్యం తో మృతి చెందగా మానకొండూర్ నియోజకవర్గం మాజి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఆయన వెంట రాజన్న సిరిసిల్ల జిల్లా మాజి జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు,రమేష్, అనిల్, వేణు తదితరులు ఉన్నారు

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి



**- కలెక్టర్ సత్య ప్రసాద్**

**- కోరుట్లలో 'ఎస్ఎస్ఆర్' ఇంటింటా సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**బలగం టీవీ, జగిత్యాల**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని పలు వార్డుల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న ఇంటింటా ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల అందజేత, వివరాల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించిన ఆయన, బీఎల్ఓల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ పలు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల సవరణ సర్వేను సమర్థవంతంగా నిర్వహించి, 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అనేది ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని, ఇందులో అధికారులు, బీఎల్ఓలు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.

ఇంటింటి సందర్శన తప్పనిసరి: ప్రతి ఇంటిని బీఎల్ఓలు తప్పనిసరిగా సందర్శించి, అర్హులైన ఓటర్లందరికీ ఫారాలను అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

అవగాహన కల్పించాలి: క్షేత్రస్థాయిలో ఓటర్లకు వచ్చే సందేహాలను నివృత్తి చేస్తూ, ఓటరు నమోదు మరియు సవరణ ప్రక్రియపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.

పొరపాట్లకు తావుండొద్దు: ఓటరు జాబితా సవరణలో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పనిచేయాలని ఆదేశించారు.

గడువులోగా పరిశీలన: ఓటర్ల నుంచి సేకరించిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**ప్రజలు సహకరించాలి..**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఓటరు నమోదు మరియు సవరణ ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

**అభివృద్ధి పనుల పరిశీలన..**

ఓటర్ల నమోదు పరిశీలన అనంతరం కోరుట్ల పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్ సత్య ప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, తహశీల్దార్ కృష్ణ చైతన్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) శ్రీనివాస్ మరియు ఇతర మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఓదెల మల్లన్న ఆలయంలో కలకలం.. భక్తులపై తేనెటీగల దాడి!లిలి

**బలగం, టీవీ పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో బుధవారం భారీ ప్రమాదం తప్పింది. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులపై తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో ఆలయ ప్రాంగణంలో తీవ్ర కలకలం రేగింది. బుధవారం మల్లన్న జాతర కావడంతో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారికి నైవేద్యం సమర్పించేందుకు భక్తులు ఆలయ ఆవరణలోని చెట్ల కింద కట్టెల పొయ్యిలపై బోనం వంటలు సిద్ధం చేయడం ప్రారంభించారు. అయితే, కట్టెల పొయ్యిల నుంచి వెలువడిన దట్టమైన పొగ నేరుగా అక్కడి చెట్లపై ఉన్న తేనెతుట్టెలకు తగిలింది. దీంతో ఒక్కసారిగా ఉధృతంగా లేచిన తేనెటీగల దండు భక్తులపై ప్రతాపం చూపించాయి.

తేనెటీగలు చుట్టుముట్టడంతో భక్తులు భయాందోళనతో చెల్లాచెదురుగా పరుగులు తీశారు. ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లలు రక్షణ కవచంగా తమ ఒంటిపై దుస్తులను కప్పుకుంటూ ఆలయ ప్రాంగణం నుంచి దూరంగా పరిగెత్తారు. ఈ దాడిలో పలువురు భక్తులకు తీవ్రంగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.

౧ ఆలయ ప్రాంగణంలోని చెట్లపై కొంతకాలంగా పెద్ద సంఖ్యలో తేనెతుట్టెలు ఉన్నాయని, ఈ విషయమై దేవాదాయ శాఖ అధికారులకు సమాచారం ఉన్నా ఎవరూ పట్టించుకోలేదని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ముందస్తు నిర్లక్ష్యం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగిందని, ఇప్పటికైనా స్పందించి వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

# నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

**డిప్యూటీ తహశీల్దార్‌కు సీపీఐ నాయకుల వినతి..**

**బలగం టీవీ, చిగురుమామిడి**

మండలంలోని అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లను తక్షణమే మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో ఇండ్లు లేని పేదలకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం సీపీఐ నాయకులు మండల డిప్యూటీ తహశీల్దార్ కళావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిరుపేదల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు విన్నవించారు.

నాయకుల నుంచి వినతి పత్రాన్ని స్వీకరించిన డిప్యూటీ తహశీల్దార్ కళావతి సానుకూలంగా స్పందించారు. మండలంలో ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన వారందరికీ న్యాయం జరిగేలా చూస్తామని, ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని సీపీఐ నాయకులకు హామీ ఇచ్చారు.

అనంతరం సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని అనేక గ్రామాల్లో నిరుపేదలు సొంత స్థలం లేక, ఇండ్లు నిర్మించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు తక్షణమే గుర్తించి, నివాస స్థలాలు లేని పేదలకు వాటిని ఇండ్ల స్థలాల కోసం కేటాయించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిరుపేదల ఆశలపై నీళ్లు చల్లకుండా ప్రభుత్వం స్పందించాలని, ఒకవేళ అర్హులైన పేదలకు న్యాయం జరగని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు, ప్రజా ఉద్యమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, బోయిని వల్లభాయ్ పటేల్, మావురపు రాజు, మండల సహాయ కార్యదర్శులు బూడిద సదాశివ, పైడిపెల్లి వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే మండల కౌన్సిల్ సభ్యులు గోలీ బాపు రెడ్డి, ఎండి. ఉస్మాన్ పాషా, ఎలగందుల రాజు, మొగిలి ఓదెలు, తమ్మిశెట్టి రవీందర్, రాకం అంజవ్వ, అందె తిరుపతి, మహంకాళి రాములు, తాళ్ళపెల్లి చంద్రయ్య, అనువోజు జనార్ధన్, కయ్యం వీరయ్య, చెంచల రవి, బద్దం కొమురెల్లా రెడ్డి, నాయిని సురేష్, పీచు మల్లారెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## వానలు కురవాలని గ్రామదేవతలకు పూలాభిషేకం, జలాభిషేకం

**బలగం టీవీ, చిగురుమామిడి**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు కలిసి గ్రామదేవతల వద్ద పూలాభిషేకం, జలాభిషేకం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో జరిపారు.

ఈ సందర్భంగా సర్పంచ్ అలువాల శంకర్ మాట్లాడుతూ.. వరుణ దేవుడు కరుణించకపోవడంతో మండలంలో సాగు పరిస్థితులు రోజురోజుకూ కష్టతరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయానికి వర్షాలు లేకపోవడంతో ఈసారి పంటల సాగు ఇప్పటికే నెల రోజులు వెనక్కి వెళ్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాభావ

# వర్షార్పణమైన తొలి టీ20..

**అయ్యర్, అభిషేక్ శర్మ మెరుపులు వృథా!**

**టాస్ గెలిచి 189 పరుగులు చేసిన భారత్..**

**ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ప్రారంభానికి ముందే భారీ వర్షం**

**వైభవ్ సూర్యవంశీకి దక్కని చోటు.. అభిమానులకు తప్పని ఎదురుచూపు**




**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య హోరాహోరీగా సాగాల్సిన 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు వరుణుడు తొలి మ్యాచ్‌లోనే అడ్డంకిగా మారాడు. చెస్టర్-లీ-స్ట్రీట్ మైదానంలో బుధవారం జరగాల్సిన తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా అర్ధాంతరంగా రద్దయింది. దీంతో భారత బ్యాటర్లు శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మల అద్భుత ఇన్నింగ్స్ వృథాగా మారింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా మొదట బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 189 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంగ్లాండ్ ముందు 190 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచినప్పటికీ.. హోస్ట్ టీమ్ ఇన్నింగ్స్ ప్రారంభం కాకముందే భారీ వర్షం కురవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

**ఆరంభంలోనే భారీ షాకులు..**

టాస్ గెలిచి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆరంభంలోనే కోలుకోలేని షాకులు తగిలాయి. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే ఓపెనర్లు సంజూ శాంసన్ (1) క్యాచ్ ఔట్ కాగా, ఇషాన్ కిషన్ (0) ఖాతా తెరవకుండానే రనౌట్ రూపంలో వెనుదిరిగాడు. కేవలం 2 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి టీమిండియా తీవ్ర కష్టాల్లో పడిన దశలో జట్టును ఆదుకునే బాధ్యతను కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, యువ సంచలనం అభిషేక్ శర్మ తమ భుజాలపై వేసుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 82 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును పటిష్ట స్థితికి చేర్చారు.

**అభిషేక్ '20 బంతుల' అర్ధశతకం..**

యువ బ్యాటర్ అభిషేక్ శర్మ ఇంగ్లాండ్ బౌలర్లపై చెలరేగిపోయాడు. మైదానం నలుమూలలా షాట్లు కొడుతూ కేవలం 24 బంతుల్లోనే 6 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 59 పరుగులు చేశాడు. ఇందులో కేవలం 20 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకోవడం విశేషం. ప్రమాదకరంగా మారుతున్న అభిషేక్‌ను శామ్ కరన్ స్లో బాల్‌తో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన తిలక్ వర్మ (13) ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయాడు.

**ఇంగ్లాండ్ బౌలింగ్: సాకిబ్ మహమూద్ 3/34 (అత్యధిక వికెట్లు).**

**కెప్టెన్ బాధ్యతాయుత ఇన్నింగ్స్.. దూబే మెరుపులు..**

మరోవైపు బాధ్యతాయుతంగా ఆడిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 47 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 68 పరుగులు చేసి సాకిబ్ మహమూద్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అంతకుముందు అయ్యర్, శివమ్ దూబే కలిసి ఐదో వికెట్‌కు 41 పరుగులు జోడించారు. చివర్లో శివమ్ దూబే ఇంగ్లాండ్ బౌలర్లపై విరుచుకుపడుతూ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 21 బంతుల్లోనే 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 42 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అక్షర్ పటేల్ (3) ఇన్నింగ్స్ ఆఖరి బంతికి రనౌట్ అయ్యాడు.

**అరంగేట్రంపై నిరాశే..**

ఈ మ్యాచ్‌లో అందరి కళ్లు యువ సంచలనం, భారత కొత్త ఆటగాడు వైభవ్ సూర్యవంశీపైనే ఉన్నాయి. ఈ మ్యాచ్ ద్వారా అతను అంతర్జాతీయ క్రికెట్ లోకి అరంగేట్రం (డెబ్యూ) చేస్తాడని అభిమానులు ఆశించినప్పటికీ.. టీమ్ మేనేజ్‌మెంట్ అతనికి తుది జట్టులో చోటు కల్పించలేదు. దీంతో వైభవ్ అరంగేట్రం కోసం అభిమానులు మరికొంత కాలం వేచి చూడక తప్పదు. సిరీస్‌లో తదుపరి మ్యాచ్ జరగాల్సి ఉంది.

**స్కోరు బోర్డు ముఖ్యాంశాలు (భారత్ ఇన్నింగ్స్):**

భారత్: 20 ఓవర్లలో 189/7 (లక్ష్యం 190 పరుగులు)

ప్రధాన బ్యాటర్ల స్కోర్లు: శ్రేయస్ అయ్యర్ 68 (47 బంతులు, 6 ఫోర్లు, 1 సిక్సర్), అభిషేక్ శర్మ 59 (24 బంతులు, 6 ఫోర్లు, 4 సిక్సర్లు), శివమ్ దూబే 42 నాటౌట్ (21 బంతులు, 2 ఫోర్లు, 3 సిక్సర్లు).



## వింబుల్డన్‌లో సెరీనా విలియమ్స్‌కు భారీ షాక్..
## తొలి రౌండ్‌లోనే ఓటమి!

**నాలుగేళ్ల తర్వాత పునరాగమనం.. సగం వయసున్న ఆస్ట్రేలియా క్రీడాకారిణి చేతిలో మాజీ ఛాంపియన్ పరాజయం**

**బలగం టీవీ, హైదరాబాద్**

టెన్నిస్ దిగ్గజం, 23 గ్రాండ్ స్లామ్ టైటిళ్ల విజేత సెరీనా విలియమ్స్‌కు వింబుల్డన్ ఓపెన్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 44 ఏళ్ల వయసులో వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ టోర్నీలో రీ-ఎంట్రీ ఇచ్చిన ఈ మాజీ ఛాంపియన్.. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లోనే పరాజయం చవిచూసింది. దాదాపు నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వింబుల్డన్ కోర్టులో అడుగుపెట్టిన సెరీనా.. అభిమానులను నిరాశపరుస్తూ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

**సగం వయసున్న ప్రత్యర్థితో హోరాహోరీ..**

ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో ఆస్ట్రేలియాకు చెందిన 20 ఏళ్ల యువ సంచలనం మాయా జాయింట్ చేతిలో 6-3, 6-7 (6), 6-3 స్కోరు తేడాతో సెరీనా విలియమ్స్ ఓటమి పాలైంది. తనకంటే సగం కంటే తక్కువ వయసున్న ప్రత్యర్థితో సెరీనా మొదటి నుంచి గట్టిగానే పోరాడింది. ఒకలో తన పాత రోజులను గుర్తు చేస్తూ గంటకు దాదాపు 129 మైళ్ల వేగంతో అద్భుతమైన సర్వీసులు విసిరింది. గ్రౌండ్ స్ట్రోక్స్‌లోనూ మెరుగైన ప్రదర్శన కనబరిచింది. అయితే, యువ క్రీడాకారిణి మాయా జాయింట్ తన చురుకైన కదలికలతో సెరీనాను కోర్టు నలుమూలలా పరుగెత్తించి ఒత్తిడిలోకి నెట్టింది. హోరాహోరీగా సాగిన రెండో సెట్‌ను సెరీనా టైబ్రేకర్‌లో కైవసం చేసుకున్నప్పటికీ, నిర్ణయాత్మక మూడో సెట్‌లో మాయా పూర్తి ఆధిక్యం ప్రదర్శించి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ ఓటమితో సెరీనా సింగిల్స్ ప్రస్థానం తొలి రౌండ్‌లోనే ముగిసి, ఆమె ఇంటిదారి పట్టాల్సి వచ్చింది.

**కుటుంబం ముందే నిరాశ..**

ఈ చారిత్రాత్మక మ్యాచ్‌ను వీక్షించేందుకు సెరీనా భర్తతో పాటు ఆమె ఇద్దరు పిల్లలు కూడా స్టేడియంకు తరలివచ్చారు. కోర్టులో సెరీనా మళ్లీ ఏదైనా అద్భుతం చేస్తుందని అభిమానులు ఆశించినప్పటికీ, ఫలితం మాత్రం నిరాశపరిచింది.

**ప్రెస్ మీట్‌కు దూరంగా..**

మ్యాచ్ ముగిసిన తర్వాత సెరీనా విలియమ్స్ అధికారిక మీడియా సమావేశానికి హాజరుకాలేదని వింబుల్డన్ నిర్వాహకులు వెల్లడించారు. పరాజయం తర్వాత ఆమె తీవ్ర అసంతృప్తికి లోనైనట్లు తెలుస్తోంది. కోర్టు వీడే సమయంలో సెరీనా భావోద్వేగానికి లోనవుతూ.. "వింబుల్డన్ కోర్టులో మళ్లీ ఆడటం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. అసలు ఇక్కడికి మళ్లీ వస్తానో లేదో అనుకున్నా.." అని వ్యాఖ్యానించింది.

# ఈక్వెడార్‌పై మెక్సికో ఘనవిజయం

**40 ఏళ్ల తర్వాత నాకౌట్‌లో గెలుపు..**

**రౌండ్-16లోకి దూసుకెళ్లిన సహ-ఆతిథ్య దేశం**



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఫిఫా ప్రపంచకప్‌లో సహ-ఆతిథ్య (కో-హోస్ట్) దేశమైన మెక్సికో సరికొత్త చరిత్ర సృష్టించింది. బుధవారం జరిగిన ఉత్కంఠభరితమైన రౌండ్-32 మ్యాచ్‌లో ఈక్వెడార్‌పై 2-0 గోల్స్ తేడాతో మెక్సికో అద్భుత విజయాన్ని నమోదు చేసి, రౌండ్-16లోకి ఘనంగా ప్రవేశించింది. నాకౌట్ దశలో మెక్సికో జట్టు ఒక విజయాన్ని నమోదు చేయడం దాదాపు నాలుగు దశాబ్దాల (40 ఏళ్ల) తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం.

**తొలి అర్ధభాగంలోనే ఆధిక్యం..**

మ్యాచ్ ఆరంభం నుంచే మెక్సికో ఆటగాళ్లు దూకుడు ప్రదర్శించారు. ఈ మ్యాచ్‌లో నమోదైన రెండు గోల్స్ కూడా తొలి అర్ధభాగంలోనే రావడం గమనార్హం. ఆట 22వ నిమిషంలో మెక్సికో స్టార్ ప్లేయర్ జులియన్ క్వినోనిస్ మెరుపు గోల్‌తో జట్టుకు తొలి ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత కోలుకునే లోపే, కేవలం 9 నిమిషాల వ్యవధిలోనే (31వ నిమిషంలో) జిమినేజ్ మరో అద్భుతమైన గోల్ కొట్టి మెక్సికోకు 2-0 ఆధిక్యాన్ని ఖరారు చేశాడు. ద్వితీయార్ధంలో ఈక్వెడార్ జట్టు గోల్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ, మెక్సికో డిఫెండర్లు సమర్థవంతంగా అడ్డుకున్నారు.

**40 ఏళ్ల నిరీక్షణకు తెర..**

మెక్సికో జట్టు చివరిసారిగా 1986లో బల్గేరియాతో జరిగిన రౌండ్-16 నాకౌట్ మ్యాచ్‌లో విజయం సాధించింది. ఆ తర్వాత వరుసగా ఏడు పర్యాయాలు నాకౌట్ దశకు చేరుకున్నప్పటికీ, ప్రతిసారీ ఓటమితోనే వెనుదిరిగింది. తాజాగా ఈక్వెడార్‌పై సాధించిన విజయంతో మెక్సికో సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. కాగా, ఈ టోర్నీలో క్వినోనిస్‌కు ఇది మూడో గోల్ కావడం విశేషం.

బెంగళూరు - హైదరాబాద్ ప్రయాణికులకు

# ఆర్టీసీ తీపి కబురు

(మొదటి పేజీ తరువాయి)

వివిధ మార్గాల్లో నడిచే బస్సులను బట్టి బెంగళూరు నగరంలో స్టాప్‌ల వివరాలను సంస్థ కింది విధంగా వర్గీకరించింది:మార్గం (రూట్)అందుబాటులో ఉండే ప్రధాన స్టాప్‌లు (స్టేజీలు)1. పీనియా రూట్ పీనియా, యశ్వంతపూర్ మెట్రో స్టేషన్, కెంపెగౌడ బస్ స్టేషన్ (మెజెస్టిక్), హెబ్బల్, ఎస్టీమ్ మాల్, ఎలాహంక, బెంగళూరు ఎయిర్ పోర్ట్ టోల్ ప్లాజా, దేవనహళ్లి బైపాస్.2. చందాపూర్ రూట్ చందాపూర్, బొమ్మసంద్ర, ఎలక్ట్రానిక్ సిటీ, బొమ్మనహళ్లి మెట్రో స్టేషన్, మడివాళ, కెంపెగౌడ బస్ స్టేషన్, హెబ్బల్ ం ఎస్టీమ్ మాల్, ఎలాహంక, బెంగళూరు ఎయిర్ పోర్ట్ టోల్ ప్లాజా, దేవనహళ్లి బైపాస్.3. మార్తహళ్లి రూట్ వర్తూర్ జంక్షన్, మార్తహళ్లి, దొమ్మలూరు బ్రిడ్జి, కెంపెగౌడ బస్ స్టేషన్, హెబ్బల్ ం ఎస్టీమ్ మాల్, ఎలాహంక, బెంగళూరు ఎయిర్ పోర్ట్ టోల్ ప్లాజా, దేవనహళ్లి బైపాస్.హైదరాబాద్‌లో బోర్డింగ్ ం అలైటింగ్ పాయింట్ల వివరాలు:బెంగళూరు నుండి హైదరాబాద్ వచ్చే అన్ని రకాల సర్వీసుల ప్రయాణికుల కోసం నగరంలోని మూడు ప్రధాన మార్గాల్లో కింది విధంగా స్టాప్‌లు అందుబాటులో ఉంటాయి:పటాన్‌చెరు రూట్: పటాన్‌చెరు నుండి ఎంజీబీఎస్ ( , ఆరాంఘర్, శంషాబాద్ వరకు ఉన్న అన్ని ప్రధాన స్టేజీలలో బస్సులు ఎక్కే, దిగే సదుపాయం కలదు.జేబీఎస్ రూట్: సికింద్రాబాద్ జేబీఎస నుండి ఎంజీబీఎస్, ఆరాంఘర్, శంషాబాద్ వరకు ఉన్న అన్ని ప్రధాన కూడళ్లలో స్టాప్‌లు ఉంటాయి.హయత్ నగర్ రూట్: హయత్ నగర్ నుండి ఎల్బీనగర్ మీదుగా ఎంజీబీఎస్, ఆరాంఘర్, శంషాబాద్ వరకు ఉన్న అన్ని ప్రధాన స్టేజీలలో ప్రయాణికులు బోర్డింగ్/అలైటింగ్ కావచ్చు.ఆర్టీసీ యాజమాన్యం పిలుపు..టీజీఎస్ ఆర్టీసీ కల్పించిన ఈ అద్భుతమైన సదవకాశాన్ని బెంగళూరు – హైదరాబాద్ మధ్య ప్రయాణించే ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులందరూ వినియోగించుకోవాలని సంస్థ కోరింది. ప్రయాణికులు తమ ఇళ్లకు దగ్గరలోనే ఉన్న బోర్డింగ్ పాయింట్లను ఎంచుకుని, ప్రభుత్వ రవాణా సంస్థలో సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణాన్ని ఆస్వాదించాలని యాజమాన్యం సూచించింది.ముందస్తు బుకింగ్స్ కోసం:ప్రయాణికులు సులభంగా తమ టికెట్లను ముందస్తుగా బుక్ చేసుకోవడానికి టీజీఎస్ ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ www.tgsrtcbus.in ను సందర్శించాల్సిందిగా కోరారు.

# రైతులకు మరో విడత 'రైతుభరోసా' విడుదల!

**2 నుంచి 3 ఎకరాల లోపు రైతులకు పెట్టుబడి సాయం..**

**ఖాతాల్లో రూ.1,590 కోట్లు జమరెండు విడతల్లో ఇప్పటివరకు 54.96 లక్షల మంది అన్నదాతలకు లబ్ధి మంత్రి తుమ్మల**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని అన్నదాతలకు తెలంగాణ ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా పథకం అమలులో ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా బుధవారం రెండో విడత రైతుభరోసా నిధులను అధికారికంగా విడుదల చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ విడతలో 2 నుంచి 3 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రూ. 1,590.02 కోట్ల నిధులను సర్కారు జమ చేసింది. రెండో విడతతో 10.68 లక్షల మందికి మేలు..ప్రస్తుత వానాకాలం సీజన్ సాగు పనులకు అవసరమైన పెట్టుబడి సకాలంలో అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి పంపింది. లబ్ధిదారులు: ఈ రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10.68 లక్షల మంది రైతులకు నేరుగా లబ్ధి చేకూరింది. సాగుభూమి విస్తీర్ణం: ఈ రైతుల పరిధిలో ఉన్న సుమారు 26.50 లక్షల ఎకరాల సాగుభూమికి ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని విజయవంతంగా అందించింది. నిధుల పంపిణీ ప్రక్రియను సులభతరం చేసేందుకు, ఖజానాపై ఒత్తిడి పడకుండా రైతులకు సకాలంలో అందేలా చూసేందుకు విడతల వారీగా ఈ సాయాన్ని విడుదల చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్క రైతుకూ పెట్టుబడి సాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటివరకు జరిగిన రైతుభరోసా పంపిణీ వివరాలు:విడత వివరాలులబ్ధి పొందిన రైతులుసాగుభూమి పరిమితివిడుదలైన నిధులుతొలి విడత (మొదటి విడత)44.27 లక్షల మంది 2 ఎకరాల వరకు రూ. 2,482.02 కోట్లు రెండో విడత (ప్రస్తుతం)10.68 లక్షల మంది 2 నుండి 3 ఎకరాల వరకు రూ. 1,590.02 కోట్లు మొత్తం (1 ం 2 విడతలు)54.96 లక్షల మంది 3 ఎకరాల వరకురూ. 4,072.04 కోట్లు దశలవారీగా మిగతా వారికీ సాయం..రైతులకు సకాలంలో పెట్టుబడి సాయాన్ని అందించడం ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ కార్యకలాపాలకు ఊతమివ్వాలన్నదే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొదటి విడతలో చిన్న, సన్నకారు రైతులకు పెద్దపీట వేస్తూ అత్యధిక సంఖ్యలో లబ్ధిదారులకు నిధులు జమ చేశామని, ఇప్పుడు విజయవంతంగా రెండో విడతను కూడా పూర్తి చేశామని వివరించారు. ఇంకా మిగిలి ఉన్న 3 ఎకరాల పైబడిన అర్హులైన రైతులకు కూడా త్వరలోనే దశలవారీగా, క్రమ పద్ధతిలో రైతుభరోసా నిధులను బ్యాంక్ ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

# వాణిజ్య ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు

**19 కిలోల కమర్షియల్ సిలిండర్‌పై రూ.183.50 తగ్గింపు**

**నయారా ఎనర్జీ పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 కోత**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అమెరికా--ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో దేశంలో ఇంధన ధరల్లో ఉపశమనం లభించింది. వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లతో పాటు పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం ధరల్లో బుధవారం నుంచి తగ్గింపు అమల్లోకి వచ్చింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గత కొన్ని నెలలుగా పెరిగిన ఇంధన ధరలు తాజాగా తగ్గడంతో వినియోగదారులు, వ్యాపార వర్గాలకు ఊరట లభించింది.

చమురు కంపెనీలు 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌పై రూ.183.50 తగ్గించాయి. దీంతో ఈ ఏడాదిలో తొలిసారిగా కమర్షియల్ ఎల్పీజీ ధరలు తగ్గాయి. గత నెలలో రికార్డు స్థాయికి చేరిన 19 కిలోల సిలిండర్ ధర ప్రస్తుతం రూ.2,930కు చేరింది. ప్రతి నెల మొదటి తేదీన అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కమర్షియల్ ఎల్పీజీ ధరలను సవరించడం జరుగుతుంది.

**ప్రధాన నగరాల్లో కమర్షియల్ ఎల్పీజీ ధరలు**

న్యూఢిల్లీ -- రూ.2,930
ముంబై -- రూ.2,885.50
బెంగళూరు -- రూ.3,021
కోల్‌కతా -- రూ.3,081.50
చెన్నై -- రూ.3,106
హైదరాబాద్ -- రూ.3,191

నయారా ఎనర్జీ ధరల కోత

దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ ఇంధన రిటైలర్ నయారా ఎనర్జీ కూడా పెట్రోల్ ధరను లీటరుకు రూ.5, డీజిల్ ధరను రూ.3 చొప్పున తగ్గించింది. ఈ సవరించిన ధరలు దేశవ్యాప్తంగా ఉన్న 7 వేలకుపైగా నయారా పెట్రోల్ బంకుల్లో అమల్లోకి వచ్చాయి. అయితే రాష్ట్రాల వారీగా వ్యాట్ తదితర స్థానిక పన్నుల కారణంగా ధరల్లో స్వల్ప మార్పులు ఉండొచ్చని సంస్థ తెలిపింది.

ఇక ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం విక్రయిస్తున్న పెట్రోల్, డీజిల్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదు.




## మూఢనమ్మకాలను ప్రశ్నిస్తూ..
## 'నిమ్మకాయ.. నీకెందుకు భయం' ప్రారంభం!

**బి.వి.సి.ఫిల్మ్స్ పతాకంపై సరికొత్త చిత్రం.. ఆగస్టు నుండి రెగ్యులర్ షూటింగ్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆధునిక సమాజంలో ఇంకా వేరూనుకుని ఉన్న మూఢనమ్మకాలను ప్రశ్నిస్తూ, ప్రజల్లో సామాజిక అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో తెరకెక్కుతున్న సరికొత్త చిత్రం 'నిమ్మకాయ.. నీకెందుకు భయం' బుధవారం హైదరాబాద్‌లో అధికారికంగా ప్రారంభమైంది. బి.వి.సి.ఫిల్మ్స్ పతాకంపై బీఎన్ఆర్ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రోశిరెడ్డి పందిళ్లపల్లి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో రాజేష్ భూపతి, స్వప్నరాజ్, అబిత హీరోహీరోయిన్లుగా నటిస్తుండగా.. సీనియర్ నటులు సుమన్, ఆమని కీలక పాత్రలు పోషిస్తున్నారు.

చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా దర్శకుడు రోశిరెడ్డి పందిళ్లపల్లి మాట్లాడుతూ.. సమాజంలో నిమ్మకాయలు, దిష్టిబొమ్మలు వంటి వాటి చుట్టూ అల్లుకున్న మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కథను సిద్ధం చేశామని తెలిపారు. కేవలం సందేశమే కాకుండా, ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకునేలా చక్కటి వినోదాన్ని (ఎంటర్‌టైన్‌మెంట్) కూడా ఈ చిత్రంలో జోడించినట్లు వివరించారు. చిత్ర నిర్మాత బీఎన్ఆర్ చౌదరి మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని, ఆగస్టు నెల నుండి ఈ సినిమా రెగ్యులర్ షుటింగ్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. సమాజానికి అవసరమైన ఒక మంచి కథాంశంతో వస్తున్న ఈ చిత్రం త్వరలోనే షుటింగ్ ముగించుకుని ప్రేక్షకుల ముందుకు రానుంది.

## చిన్నారుల టాక్ షోలో కేటీఆర్ సందడి

**లైవ్‌లో ప్రభాస్‌కు ఫోన్.. పుష్-అప్స్ ఛాలెంజ్‌తో ఆకట్టుకున్న మాజీ మంత్రి**

**'ది అండర్ 18 వరల్డ్' షో ప్రోమో వైరల్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) రాజకీయాలకు భిన్నంగా వినోదాత్మక కోణంలో అభిమానులను అలరించారు. 'ది అండర్ 18 వరల్డ్' పేరుతో రూపొందిన చిన్నారుల టాక్ షోలో పాల్గొన్న కేటీఆర్ సరదా సంభాషణలు, ఆసక్తికర సంఘటనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. షోలో చిన్నారుల కోరిక మేరకు కేటీఆర్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు లైవ్‌లోనే ఫోన్ కాల్ చేశారు. ప్రభాస్‌తో కేటీఆర్ మాట్లాడుతున్న సమయంలో బ్యాక్‌గ్రౌండ్‌లో 'బాహుబలి' నేపథ్య సంగీతం వినిపించడంతో కార్యక్రమం మరింత ఆసక్తికరంగా మారింది.

ఇంటర్వ్యూలో ఓ చిన్నారి విసిరిన పుష్-అప్స్ ఛాలెంజ్‌ను కేటీఆర్ స్వీకరించి స్టేజ్‌పైనే పుష్-అప్స్ చేసి తన ఫిట్‌నెస్‌ను ప్రదర్శించారు. దీంతో అక్కడున్న చిన్నారులు, ప్రేక్షకులు చప్పట్లతో అభినందించారు. ఇంటర్వ్యూ మధ్యలో కేటీఆర్ సతీమణి శైలిమ నుంచి ఫోన్ రావడంతో, "షోలో ఉన్నాను.. తర్వాత మాట్లాడతా" అంటూ నవ్వుతూ కాల్ ముగించడం ప్రోమోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సన్నివేశంపై నెటిజన్లు సరదా వ్యాఖ్యలు చేస్తున్నారు. చిన్నారులు అడిగిన ఫన్నీ, గూగ్లీ తరహా ప్రశ్నలకు సమాధానాలు చెప్పే క్రమంలో కేటీఆర్ పలుమార్లు నవ్వులు పంచారు. ఒక రాజకీయ నాయకుడి సరదా, ఆత్మీయ కోణాన్ని ఆవిష్కరించిన ఈ పూర్తి ఇంటర్వ్యూ త్వరలో విడుదల కానుంది.

## వైద్య విద్యే నా తొలి ప్రాధాన్యం: నటి శ్రీలీల

**'వైరల్ వయ్యారి' షుటింగ్ మధ్యలోనే ఎంబీబీఎస్ పరీక్షలు రాశా**

**డాక్టర్స్ డే సందర్భంగా సినీ--వైద్య ప్రయాణం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సినీ కెరీర్‌తో పాటు వైద్య విద్యను సమర్థంగా కొనసాగించడం సవాల్‌గా ఉన్నప్పటికీ, తన చిన్ననాటి కలను నెరవేర్చుకునేందుకు ఎప్పుడూ వైద్య విద్యకే తొలి ప్రాధాన్యం ఇచ్చానని నటి శ్రీలీల తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆమె తన ఎంబీబీఎస్ చదువు, సినిమా షుటింగ్‌లను ఎలా సమన్వయం చేసుకున్నారో వివరించారు.

"డాక్టర్ కావడం నా చిన్ననాటి కల. అదే నా అతిపెద్ద అభిరుచి. 'వైరల్ వయ్యారి' పాట చిత్రీకరణ జరుగుతున్న సమయంలో కూడా నా ఎంబీబీఎస్ పరీక్షలకే మొదటి ప్రాధాన్యం ఇచ్చాను. షుటింగ్ పూర్తయ్యాక వెంటనే ప్రాక్టికల్స్‌కు వెళ్లేదాన్ని. మధ్యలో విరామం దొరికితే మళ్లీ సెట్స్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొనేదాన్ని. ఇది అంత సులభం కాదు. కానీ వైద్య విద్య నాకు ఎంతో విలువైనది" అని శ్రీలీల పేర్కొన్నారు.

'వైరల్ వయ్యారి' పాట 'జూనియర్' చిత్రంలోని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో కిరీటి రెడ్డి హీరోగా నటించగా, దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. రాధాకృష్ణ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాను సాయి కొర్రపాటి నిర్మించారు. ప్రస్తుతం శ్రీలీల తెలుగు, తమిళం, హిందీ భాషల్లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. తెలుగులో 'ఉస్తాద్ భగత్ సింగ్', తమిళంలో 'పరాశక్తి', అలాగే దర్శకుడు అనురాగ్ బసు తెరకెక్కిస్తున్న హిందీ రొమాంటిక్ మ్యూజికల్